క్లుప్తంగా

సీఎం రిలీఫ్ ఫండ్ అందజేత



నాగేశ్వరరావుకు సీఎం రిలీఫ్ ఫండ్ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

కపిలేశ్వరపురం: ఉదర సంబంధిత శస్త్రచికిత్స చేయించుకుని కోలుకుంటున్న పడమర ఖండ్రికకు చెందిన అన్నెం వరలక్ష్మికి రూ.మూడు లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైంది. సంబంధిత పత్రాలను గురువారం అంగర వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చేతుల మీదుగా వరలక్ష్మి కుటుంబ సభ్యులకు అందజేశారు. వరలక్ష్మి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ జాగ్రత్త పడాలని ఆమె భర్త నాగేశ్వరరావుకు సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ పుట్టపూడి అబ్బు, సర్పంచ్ తిరునాతి వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ గంగుమళ్ల రాంబాబు, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కవల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగలు



ఉదయం 10 గంటలకే నిర్మానుష్యంగా మారిన కె.గంగవరం మెయిన్ రోడ్డు

కె.గంగవరం: ఎండలు విజృంభిస్తుండటంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. రెండు రోజులుగా పగటి ఉష్ణోగ్రత 40 డిగ్రీల సెల్సియస్‌కు పైగా నమోదవుతోంది. దీంతో జనం ఇళ్లకే పరిమితమవుతున్నారు. మధ్యాహ్నం వేళ పలు గ్రామాల్లోని రోడ్లపై జనసంచారం కనిపించడం లేదు. ఉష్ణతాపం నుంచి ఉపశమనం పొందేందుకు కూల్ డ్రింక్ షాపులు, జ్యూస్ సెంటర్లు, కొబ్బరి బొండాల దుకాణాల వద్ద జనం బారులు తీరుతున్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

మండపేట: మండపేటలో సాధారణ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏడీఈ జి.తిరుమలరావు తెలిపారు. స్థానిక ఏడిద బైపాస్ రోడ్డు, సంఘం కాలనీ, విజయలక్ష్మీ నగర్, మెహర్ ఆశ్రమం, సత్యశ్రీ రోడ్డు తదితర ప్రాంతాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. దీనికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఇంధన పొదుపుపై నేడు అవగాహన సదస్సు

రామచంద్రపురం: ఇంధన పొదుపుపై స్థానిక బైపాస్ రోడ్డులోని విజయ ఫంక్షన్ హాలులో శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారు. ఏపీ ఈపీడీసీఎల్ డీఈ దాట్ల శ్రీధర్ వర్మ గురువారం ఒక ప్రకటనలో ఈ విషయం తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ సదస్సులో నిపుణులైన విద్యుత్ అధికారులు పాల్గొంటారన్నారు. విద్యుత్ వినియోగదారుల అధిక సంఖ్యలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉద్యోగుల రిలే దీక్షలు

రామచంద్రపురం: రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు గురువారం రిలే దీక్షలు చేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారాయుడు, ప్రధాన కార్యదర్శి ఆదిలక్ష్మి, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ ఎం.బాపూజీ తదితరులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది, పెన్షనర్లకు, అన్ని తరగతుల ఉద్యోగులకు ప్రతి నెల 1వ తేదీనే జీతాలు చెల్లించే విధంగా చట్టం చేయాలని, కాంట్రాక్టు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సీపీఎస్ రద్దు చేస్తూ పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మొత్తం 26 డిమాండ్ల సాధనకు రిలే దీక్షలు చేస్తున్నామని తెలిపారు. సంఘం రామచంద్రపురం తాలూకా యూనిట్ అధ్యక్షుడు వైఎస్ఎన్ మూర్తి, అసోసియేట్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్.ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి ఈశ్వరరావు, ఉపాధ్యక్షుడు కమల్ శేషు భగవాన్, కోశాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠాపనా మహోత్సవం

ఆత్రేయపురం: ర్యాలి ఉమా కమండలేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభం పునఃప్రతిష్ఠాపనా మహోత్సవం గురువారం ఉదయం 8.31 గంటలకు ప్రారంభమయ్యాయి. వేద పండితులు, అర్చకుల ఆధ్వర్యాన ఉదయం సంకల్పం, గణపతి పూజ, పుణ్యాహవాచనం, పంచగవ్యప్రాశన, దీక్షాధారణ, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, జలాధివాసం, మధ్యాహ్నం మండపారాధన, అంకురార్పణ, ధ్వజారోహణ, క్షీరాధివాసం తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. జెడ్పీటీసీ బోణం సాయిబాబు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ బి.కృష్ణచైతన్య ఆధ్వర్యాన సిబ్బంది పర్యవేక్షించారు. ఈ ఉత్సవాలు శనివారం వరకూ జరుగుతాయని తెలిపారు.

ఏమి భాగ్యము స్వామీ...

- ఆధునీకరణతో అలరారుతున్న శ్రీవారి ఆలయం
- రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు
- రాయవరంలో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత



ఆలయ గోడలపై ఆకట్టుకుంటున్న విగ్రహాలు

రాయవరం: ఏడుకొండల వాసా... చిద్విలాసా అంటూ మొక్కే ఆ స్వామివారి కోవెల ఆధునీకరణతో అలరారుతోంది.. సర్వాంగ సుందరంగా ముస్తాబైంది.. అభివృద్ధితో ఆధ్యాత్మికత వెల్లివిరుస్తోంది.. రాయవరంలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం ఆధునీకరణ అందరినీ ఆకట్టుకుంటోంది. ఆలయంలోకి అడుగు పెట్టగానే ఆధ్యాత్మిక వాతావరణం సంతరించుకుంటుంది. గ్రామంలో ప్రధాన ఆలయాల్లో ఒకటిగా ఉన్న శ్రీవారి ఆలయం రంగులు వెలిసిపోయి, కళావిహీనంగా ఉండేది. వాస్తుదోషాలు కూడా తోడవ్వడంతో ఆలయాన్ని అభివృద్ధి చేయాలని భక్తులు ఆశించారు. ఈ పరిస్థితుల్లో ఆలయ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన పులగం శ్రీనివాసరెడ్డి ఆలయ అభివృద్ధికి నడుం బిగించారు. రూ.20 లక్షలతో ఆలయ అభివృద్ధి పనులు చేపట్టారు. పూర్తిగా గ్రామంలోని దాతల విరాళాలతో ఆలయాన్ని అభివృద్ధి చేసిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇక్కడ ఏటా వార్షికోత్సవ కల్యాణమే కాకుండా ప్రతి నెలా భక్తుల సహకారంతో నక్షత్ర కల్యాణం నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆలయాన్ని అభివృద్ధి చేయాలని అందరూ భావించారు. అందుకనుగుణంగా ఆలయానికి రంగులు వేయించడం, ధ్వజ స్తంభాన్ని సుందరంగా పునర్నిర్మించడమే కాకుండా, ఆలయం లోపల దశావతార విగ్రహాలను ఏర్పాటు చేసి, దానికి విద్యుద్దీపాలను అలంకరించారు. రాత్రి సమయంలో విద్యుద్దీపాల వెలుగులో దశావతార విగ్రహాలు మరింత శోభాయమానంగా ఆకట్టుకుంటున్నాయి.

కాలక్షేప మండపానికి హామీ

ఆలయ అభివృద్ధి పనులు చూసిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇవ్వడంతో భక్తుల సంతోషం మరింత రెట్టింపైంది. ఆలయంలో కాలక్షేప మండప నిర్మాణానికి టీటీడీ నుంచి రూ.50 లక్షల నిధులు మంజూరు చేయించేందుకు హామీ ఇచ్చారు. దీంతో ఆలయం మరింత అభివృద్ధి చెందనుందని భక్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

నవనీత హారతికి ఏర్పాట్లు

ఆలయంలో ప్రతి శనివారం వేకువజామున నవనీత హారతిని శ్రీవారికి ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తిరుమల మాదిరిగా ప్రతి శనివారం దంపతులతో ఈ హారతి ఇస్తారు. వెన్నముద్దలో దీపారాధన ఇవ్వడం నవనీత హారతి ప్రత్యేకత. ఈ ఏడాది ఆగస్టు నుంచి నవనీత హారతిని ప్రారంభించేందుకు ఆలయ పాలక మండలి సన్నాహాలు చేస్తోంది.



ఆధునీకరణ పనులతో అలరారుతున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం

ఎన్నడూ లేని విధంగా..



శ్రీవారి ఆలయాన్ని గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి చేశారు. ఆలయంలోకి అడుగు పెట్టగానే ఆధ్యాత్మిక భావం కలుగుతోంది. భక్తుల కొంగుబంగారంగా కొలువైన శ్రీవారికి ప్రతి నెలా నిర్వహిస్తున్న నక్షత్ర కల్యాణాలు కూడా నేత్రపర్వాన్ని కలిగిస్తున్నాయి.

–వాద్రేవు శ్రీనివాసరావు, రాయవరం

దాతల సహకారంతో..



రాయవరం, పరిసర గ్రామాలకు చెందిన భక్తుల విరాళాలతో ఆలయాన్ని అభివృద్ధి చేశాం. గతంలో ఎన్నడూ లేని విధంగా చేపట్టిన ఆలయ అభివృద్ధికి తోడు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ తేతల సుబ్బరామారెడ్డి సహకారం మరువలేనిది. భవిష్యత్తులో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తాను.

–పులగం శ్రీనివాసరెడ్డి, చైర్మన్, వేంకటేశ్వరస్వామి ఆలయం, రాయవరం

'జగనన్న విద్యా కానుక' సక్రమంగా అందించాలి



జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న చామంతి నాగేశ్వరరావు

కాజులూరు: విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు సక్రమంగా పంపిణీ చేయాలని కాకినాడ జిల్లా సమగ్ర శిక్షా అభియాన్ సీఎంఓ చామంతి నాగేశ్వరరావు అన్నారు. కాజులూరు జెడ్పీ హైస్కూలులో గురువారం ఏర్పాటు చేసిన జగనన్న విద్యాకానుక కిట్ల స్టాక్ పాయింట్‌ను ఆయన, ఇతర అధికారులు సందర్శించారు. కానుక పంపిణీలో తీసుకోవలసిన జాగ్రత్తలపై ఎంఈఓలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగనన్న విద్యా కానుక కిట్ల ద్వారా విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు, బూట్లు తదితర సామగ్రిని ప్రభుత్వం ఉచితంగా అందజేస్తోందని చెప్పారు. విద్యా కానుక కిట్లు మండలాలకు చేరాయని, సాధ్యమైనంత త్వరలో వాటిని విద్యార్థులకు అందించేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ప్రముఖ వైద్యుడు సీవీకే రావు అందించిన ప్రొటీన్ ఫుడ్‌ను గ్రామంలోని భవిత పాఠశాల విద్యార్థులకు నాగేశ్వరరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ కేవీవీ సత్యనారాయణ, సీఆర్పీలు సుజాత, ప్రశాంతి, నాగజ్యోతి, చంటిబాబు, శ్రీనివాస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పేదల చెంతకే ప్రభుత్వ పథకాలు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- వై.సావరంలో గడప గడపకూ..



ఎమ్మెల్సీ త్రిమూర్తులు సమక్షంలో పార్టీలో చేరిన సత్యనారాయణ

మండపేట: వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా పేదల చెంతకే పథకాలు దరిచేరుతున్నాయని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. గురువారం వై.సావరంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడిద సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం అధ్యక్షతన జెడ్పీటీసీ సభ్యురాలు కుడిపూడి భవాని, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, యువనేత తోట పృథ్వీరాజ్, పార్టీ శ్రేణులతో కలసి ఆయన పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. అనంతరం ప్రజలు ఆయన దృష్టికి తెచ్చిన సమస్యల పరిష్కారానికి ఎంపీడీఓ ఐ.రాజు, గ్రామ కార్యదర్శి వుండమట్ల వీర్రాజులకు ఆదేశాలిచ్చారు. తొలుత జెడ్పీటీసీ భవాని, రాంబాబు దంపతుల ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ త్రిమూర్తులుకు ఘన స్వాగతం పలికారు. ఆయనను ఎడ్ల బండిపై ర్యాలీగా గ్రామంలోకి తీసుకువచ్చారు. ఏడిద కాంగ్రెస్ పార్టీ నేత చంద్ర వీరవెంకట సత్యనారాయణ, తన తనయుడు బాలాజీ, అనుచరులతో కలసి ఎమ్మెల్సీ తోట సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. సీఎం జగన్ పాలన, ఎమ్మెల్సీ నాయకత్వానికి ఆకర్షితులై పార్టీలో చేరామని వారన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ విజయానికి పనిచేస్తానని సత్యనారాయణ తెలిపారు. వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్, ఎంపీటీసీ సభ్యుడు చొల్లంగి రామారావు, పార్టీ నాయకులు వల్లూరి రామకృష్ణ, పిల్లా అరవరాజు, ఈదల వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్ కల్వర్టులు నిర్మించరూ..



కల్వర్టు లేక ప్రమాదకరంగా ఉన్న కూళ్ల రహదారి

కె.గంగవరం మండలం కూళ్ల – పామర్రు ప్రధాన రహదారిపై ఉన్న పంట కాలువలపై కల్వర్టులు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఈ రోడ్డుపై రెండుచోట్ల కేవలం తూరలు వేసి ఇరువైపులా స్తంభాలు పాతారు. దీనివల్ల వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి వేళ మరింత ఇబ్బందికరంగా ఉంటోంది. ఈ పంట కాలువలపై రెండుచోట్లా కొత్త కల్వర్టులు నిర్మించి, రక్షణ గోడలు నిర్మించాలని వాహనచోదకులు, గ్రామస్తులు కోరుతున్నారు. – కె.గంగవరం

విద్యుత్తు సమస్యలను సత్వరం పరిష్కరించండి

మండపేట: ఏడిదలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి సత్వరం చర్యలు చేపట్టాలని ఆ శాఖ అధికారులను ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆదేశించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా వారం రోజులుగా ఆయన ఏడిదలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా దేవుడుతాళ్ల కాలనీ, ఎస్సీ కాలనీ, కొత్తూరు తదితర ప్రాంతాల్లో గ్రామస్తులు ఆయన దృష్టికి తెచ్చిన విద్యుత్ సమస్యలపై గురువారం ఎస్ఈ టీఎస్ఎన్ మూర్తి, ఈఈ దాట్ల శ్రీధరవర్మ, ఏడీఈ జి తిరుమలరావుతో గ్రామంలో సమీక్షించారు. అధికారులతో కలిసి దేవుడుతాళ్ల కాలనీలో పర్యటించారు. ఇళ్లపై ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ లైన్లను తొలగించాలని సూచించారు. అలాగే అవసరమైన చోట్ల విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని, గ్రామంలో లోఓల్టేజీ సమస్య లేకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఆయా సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఏడిదలో సొంతిల్లు లేక అగచాట్లు పడుతున్న నిరుపేద మహిళకు దేవుడుతాళ్ల కాలనీలో ఇంటి పట్టాను ఎమ్మెల్సీ త్రిమూర్తులు అందజేశారు. గ్రామానికి చెందిన ఎం.దుర్గ సొంతిల్లు లేక ఇబ్బంది పడుతుండటంతో సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకురాగా ఇంటి స్థలం ఇచ్చేందుకు గతంలో హామీ ఇచ్చి ఈ చర్యలు తీసుకున్నారు. కుడిపూడి రాంబాబు, పలివెల సుధాకర్, వల్లూరి రామకృష్ణ, రామారావు పాల్గొన్నారు.

తప్పిన పెనుప్రమాదం



మాచవరంలో రోడ్డుపై పడిన భారీ చెట్టు కొమ్మ

అంబాజీపేట: మాచవరం – అంబాజీపేట ప్రధాన రహదారిలో రోడ్డు పక్కన ఉన్న ఒక చెట్టు కొమ్మ గురువారం రాత్రి ఒక్కసారిగా విరిగిపోయింది. నిత్యం రద్దీగా ఉండే ఈ రహదారిలో పగటి వేళ ఈ కొమ్మ విరిగి పడి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. అర్ధరాత్రి ఈ సంఘటన జరగడంతో పెద్ద ప్రమాదం తప్పిందని ఊపిరి పీల్చుకున్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల పంపిణీ



విజేతలకు బహుమతి అందిస్తున్న విప్ జగ్గిరెడ్డి, కలెక్టర్ శుక్లా, ఎమ్మెల్యే కొండేటి

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలల మైదానంలో చిన్నం తేజారెడ్డి ఆధ్వర్యాన నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. విజేతలకు ముఖ్య అతిథులుగా పాల్గొన్న ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు, కలెక్టర్ హిమాన్షు శుక్లా బహుమతులు అందజేశారు.

ప్రథమ బహుమతిగా ట్రోఫీ, రూ.50 వేల నగదు, ద్వితీయ బహుమతిగా ట్రోఫీ, రూ.30 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో సీఆర్‌సీ స్పోర్ట్స్ డైరెక్టర్ నల్లమిల్లి వీరరాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ డెల్టాకు నీటి విడుదల

ఆత్రేయపురం: కాలువలకు జలకళ వచ్చేసింది. ముందుగా ప్రకటించిన విధంగానే ఇరిగేషన్ ఏఈ పిల్లా సత్యనారాయణ, ఎల్ఎస్ సీహెచ్ బ్రహ్మాజీరావులు సెంట్రల్ డెల్టా కాలువలకు నీరు విడుదల చేశారు. వేద పండితులు నిర్ణయించిన ముహూర్తం ప్రకారం గురువారం మధ్యాహ్నం 12.30 గంటలకు మోటార్ల స్విచ్ ఆన్ చేసి, కాటన్ బ్యారేజీ గేట్లు ఎత్తి 200 క్యూసెక్కుల నీటిని కాలువలోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా హెడ్ స్లూయిజ్‌ను మామిడి తోరణాలు, అరటి చెట్లతో ముస్తాబు చేశారు. గోదావరికి పూజలు చేసి, నూతన వస్త్రాలు, పసుపు కుంకుమలు, పండ్లు సమర్పించి, హారతి ఇచ్చారు. నీటి విడుదలను క్రమేపీ పెంచుతామని వారు చెప్పారు.

సేంద్రియ సాగుకు సై

- మొగ్గు చూపుతున్న నియోజకవర్గ రైతులు
- ప్రోత్సహిస్తున్న వ్యవసాయాధికారులు
- రసాయన ఎరువుల వాడకంతో దుష్ఫలితాలు
- పంట దిగుబడులకు చేటు తెస్తున్న క్రిమి సంహారక మందులు

ఎన్నో ప్రయోజనాలు

సేంద్రియ ఎరువులు, పచ్చిరొట్ట వాడకంతో ఎన్నో ప్రయోజనాలున్నాయి. దీనికి ప్రతి రైతూ ప్రాధాన్యం ఇవ్వాలి. రసాయన ఎరువులు ఎక్కువగా ఉపయోగించడంతో పాలంలో భూసారం దశల వారీగా తగ్గిపోతుంది. తెగుళ్ల బెడద ఎక్కువై దిగుబడి క్రమంగా తక్కువగా వస్తుంది. సేంద్రియ ఎరువుల వాడకం వలన భూసారం పెరగడమే కాకుండా నాణ్యమైన పంట ఉత్పత్తులు వస్తాయి. భూమిలో తేమ ఎక్కువ రోజులుండటం వలన పంటలు ఎండిపోవు. సేంద్రియ ఎరువులు వాడిన పాలాల్లో చీడపీడలు, తెగుళ్ల తక్కువగా ఉంటాయి. చెరువు మట్టి, పశువుల పేడలో నత్రజని, భాస్వరం, జింక్, మెగ్నీషియం, ఐరన్, పొటాష్, బోరాన్ వంటి పోషకాలు లభించడంతో పంటలు ఆరోగ్యంగా పెరిగి అధిక దిగుబడులు వస్తాయి. త్వరలో పంట దమ్ములు చేయనున్న తరుణంలో రైతులందరూ సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి పెట్టాలి.

– వి.అశోక్, మండల వ్యవసాయాధికారి, కాజులూరు



మొగలిపాలెంలో పశువుల పెంటను ఎడ్ల బండిపై తెచ్చి పొలంలో వేస్తున్న రైతు

కాజులూరు: అన్నదాతలు క్రమంగా సేంద్రియ సాగు వైపు మొగ్గు చూపుతున్నారు. సుమారు 20 సంవత్సరాల క్రితం వరకూ పంటల సాగులో రైతులు కేవలం సేంద్రియ ఎరువులనే వినియోగించే వారు. క్రమేపీ పంట దృఢంగా పెరగడానికి, అధిక దిగుబడుల కోసం రసాయన ఎరువుల వినియోగం ప్రారంభించారు. వీటితో పాటు పంటలపై వివిధ రకాల తెగుళ్లు, పురుగుల నివారణకు, కలుపు నిర్మూలనకు క్రిమి సంహారక మందుల వినియోగం ప్రారంభించారు. రసాయన ఎరువుల వినియోగంతో క్రమేపీ భూసారం దెబ్బ తినటమే కాకుండా ఆహార ధాన్యాలు విషతుల్యమై, వాటిని తింటున్న ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని నిపుణులు కొన్నాళ్లుగా హెచ్చరిస్తున్నారు. అంతే కాకుండా ఇటువంటి ఆహార ధాన్యాల ఎగుమతులకు పలు దేశాలు నిరాకరిస్తున్నాయి. ఈ పరిణామాలపై ప్రభుత్వ యంత్రాంగం రైతుల్లో అవగాహన కల్పించి, సేంద్రియ సాగు ఆవశ్యకతపై చైతన్యపరుస్తోంది. ఈ నేపథ్యంలో కొందరు రైతులు ఇటీవల సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి సారిన్నారు. పశువుల పేడ, చీకిన గడ్డిని ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లపై తీసుకువచ్చి పొలాల్లో వేస్తున్నారు. సొంతంగా పశువులు లేని రైతులు కోళ్లఫారాల్లోని కోడిపెంట, చెరువులు, కుంటల్లోని పూడిక మట్టిని కొనుగోలు చేసి మరీ పొలాల్లో వేస్తున్నారు. తద్వారా రసాయనిక అవశేషాలు లేని పంట దిగుబడులు సాధించడంతో పాటు భూసారం పెంచేందుకు కృషి చేస్తున్నారు.

రామచంద్రపురం నియోజకవర్గంలో సాగు భూమి 56 వేల ఎకరాలు ఉంది. కాజులూరు మండలంలో 19 వేలు, రామచంద్రపురం మండలంలో 18 వేలు, కె.గంగవరం మండలంలో 19 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రతి మండలంలోనూ సగటున 20 శాతం రైతులు సేంద్రియ సాగుకు సిద్ధమవుతున్నారని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. సేంద్రియ ఎరువులు వేసిన పొలంలో యూరియా, డీఏపీ, పొటాష్ వంటి కర్బన ఎరువుల వినియోగం దాదాపు తగ్గిపోవడమే కాకుండా ఎకరానికి ఐదు నుంచి 10 బస్తాల నాణ్యమైన అధిక దిగుబడి లభిస్తోందని రైతు సంఘం నాయకుడు, తణుకువాడ పీఏసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు తాడి వెంకటరెడ్డి అన్నారు. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి కొద్ది రోజుల్లో కాలువల ద్వారా నీరు పొలాలకు చేరనుంది. దీంతో తూర్పు డెల్టా కాలువ శివారు భూముల్లోని నియోజకవర్గ గ్రామాల్లో పంట దమ్ములు జోరుగా ప్రారంభమవుతాయి. దమ్ములకు ముందే సేంద్రియ ఎరువులను పొలాల్లో కలియదున్నితే త్వరగా మట్టిలో కలిసి, మంచి ఫలితాలు వస్తాయని రైతులు చెబుతున్నారు.

రైతుల ఖాతాల్లో రూ.4.98 కోట్ల జమ

రామచంద్రపురం రూరల్: మండలంలోని 9,064 మంది రైతుల ఖాతాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గురువారం రూ.4,98,52,000 జమ చేశారని మండల వ్యవసాయ అధికారి ఎన్.సత్యప్రసాద్ తెలిపారు. వైఎస్సార్ రైతుభరోసా పథకంలో భాగంగా వరుసగా ఐదో సంవత్సరం కూడా ప్రతి రైతు ఖాతాలో మొదటి విడతగా రూ.5,500 జమ చేశారన్నారు. రైతుభరోసా పంపిణీ కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలోని రైతుభరోసా కేంద్రం వద్ద ప్రత్యక్ష ప్రసారం చేశామని పేర్కొన్నారు.

సాయినాథునికి ప్రత్యేక పూజలు



మండపేటలో సాయిబాబా వారిని దర్శించుకుంటున్న నాగేశ్వరరావు తదితరులు

మండపేట: స్థానిక తర్వాణిపేటలో సాయిబాబా వారి ఆలయ 18వ వార్షికోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఆలయాన్ని పూలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయ కమిటీ చైర్మన్ కాసా నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉదయం నుంచి రాత్రి వరకూ స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హారతులు ఇచ్చారు. మండపేట, పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. పట్టణ ప్రముఖులు యినపకోళ్ల సత్యనారాయణ (ఐఎస్ఎన్), కౌన్సిలర్ చిట్టూరి సతీష్, అధికారులు తదితరులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నసమారాధనలో 5 వేల మందికి పైగా భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు కోన సత్యనారాయణ, దూలం చక్రియ్య, గుండు తాతరాజు, పసుపులేటి వెంకట్రావు, గుమ్మడి రాంబాబు, దొంగా ప్రసాద్, అరటి మహేష్, కోళ్ల శ్రీనివాస్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి గ్రామోత్సవం

రాయవరం: స్థానికంగా శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి గురువారం గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవంలో భాగంగా స్వామివారు, దేవేరుల ఉత్సవ విగ్రహాలను ఆలయ అర్చకుడు పెద్దింటి కృష్ణమాచార్యుల ఆధ్వర్యంలో పల్లకిలో ఊరేగించారు. ఆలయ చైర్మన్ పులగం శ్రీనివాసరెడ్డి, ఈఓ ఎస్.అయ్యప్పరాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ

రామచంద్రపురం రూరల్: కుందాలమ్మ చెరువు గ్రామంలోని రామాలయ ప్రాంగణంలో గురువారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన విగ్రహ దాతలు మేడిశెట్టి ధనరాజు, కనకలక్ష్మి దంపతుల చేతుల మీదుగా పూజలు, హోమాలు నిర్వహించారు. భారీ ఎత్తున అన్న సమారాధన నిర్వహించారు. గ్రామంతో పాటు పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

చోరీ కేసులో వ్యక్తికి జైలు

కపిలేశ్వరపురం: సెల్‌ఫోన్ల చోరీ కేసులో కాలేరుకు చెందిన గుడాల లోవరాజుకు నెల రోజుల సాధారణ జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి డాక్టర్ కె.దీప దైవకృప గురువారం తీర్పు చెప్పారు. అంగర ఎస్సై జి.చంటి కథనం ప్రకారం.. నెల్లూరు జిల్లా పెనుమల్లికి చెందిన వరికోత యంత్రం ఆపరేటర్ గుమ్మా నవీన్ 2021 డిసెంబర్లో కపిలేశ్వరపురం మండలం వల్లూరులో వరికోత పనులు చేసేందుకు వచ్చాడు. పని ముగిశాక నిద్రిస్తుండగా లోవరాజు నాలుగు సెల్ ఫోన్లను చోరీ చేశాడు. బాధితుడు నవీన్ ఫిర్యాదుపై 2021 డిసెంబర్ 1న అప్పటి ఎస్సై బి.సంపత్‌కుమార్ కేసు నమోదు చేశారు. లోవరాజు చేసిన నేరం రుజువు కావడంతో శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకులకు గాయాలు



బైకును ఢీకొన్న ఆర్టీసీ బస్సు

కాజులూరు: ఆర్టీసీ బస్సు ఢీకొని ఇద్దరు యువకులు గాయపడ్డారు. స్థానికుల కథనం ప్రకారం కోరుమిల్లికి చెందిన ఇద్దరు యువకులు మోటార్ సైకిల్‌పై గురువారం కాకినాడ వెళ్తున్నారు. ఆర్యావటం కుళాయి చెరువు జంక్షన్ మలుపు వద్ద ఎదురుగా కాకినాడ – కోటిపల్లి ఆర్టీసీ బస్సు వస్తోంది. దగ్గరకు వచ్చే వరకూ అక్కడ వాహనాలు కనిపించే పరిస్థితి లేకపోవటంతో బైకును బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న యువకులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని 108లో కాకినాడ ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై తమకు ఎటువంటి ఫిర్యాదూ అందలేదని గొల్లపాలెం పోలీసులు తెలిపారు.

పురుగు మందు తాగి ఆత్మహత్య

కాజులూరు: పురుగు మందు తాగి ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. స్థానికులు, గొల్లపాలెం పోలీసుల కథనం ప్రకారం.. దుగ్గుదుర్రు గ్రామానికి చెందిన జోడా చిట్టిబాబు (46) గురువారం తన పొలంలో ఈ ఘాతుకానికి ఒడిగట్టాడు. అపస్మారక స్థితికి చేరుకున్న అతడిని కుటుంబీకులు కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ చిట్టిబాబు మృతి చెందాడు. గొల్లపాలెం ఎస్సై ఎం.తులసీరామ్ సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. చిట్టిబాబు గ్రామంలో కొంత పొలం సాగు చేస్తున్నాడని వరుసగా పంట నష్టం రావటంతో అప్పుల పాలై పురుగు మందు తాగాడని కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి తహసీల్దార్‌కు నివేదిక అందజేశామని ఎస్సై తెలిపారు.